# ఓట్లు దండుకొని కాంగ్రెస్ దగా



**రైతులకు అడుగడుగునా రేవంత్ సర్కార్ ద్రోహం**

**కేసీఆర్ హయాంలో సాగు పండుగ.. నేడు దండుగ**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు**

హైదరాబాద్ జూన్ 24 (నమస్తేతెలంగాణ): 'ఉచిత కరెంట్‌తో వ్యవసాయానికి ఊతమిచ్చి.. సాగునీటితో రైతాంగానికి ప్రోత్సాహమిచ్చి.. పంట పెట్టుబడికి సాయమందించి.. మట్టిని నమ్ముకున్న రైతు ఏదైనా పరిస్థితుల్లో మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల రైతుబీమాతో అండగా నిలిచి.. వంద శాతం కొనుగోళ్లతో భరోసా ఇచ్చి.. కరోనా కాలంలోనూ కర్షకుల కష్టాలను గుర్తెరిగి రైతు బంధు, రైతుబీమాను కొనసాగించి.. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరిపి..అంతకు ముందు కాంగ్రెస్ పాలనలో దండుగలా మారిన వ్యవసాయాన్ని కేసీఆర్ పదేండ్ల పాలనలో పండుగలా తీర్చిదిద్దిండ్రు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. కానీ ఏడాదిన్నర రేవంత్‌రెడ్డి పాలనలో సాగు మళ్లీ దండుగలా మారిందని మంగళవారం ఎక్స్‌వేదికగా విమర్శించారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని రూ.12 వేలకే కుదించారని మండిపడ్డారు. 'ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు రెండుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టి.. రైతుబీమాను పక్కనబెట్టి, రుణమాఫీని తుంగలో తొక్కి, క్వింటాల్ వడ్లకు రూ. 500 బోనస్‌కు సున్నం పెట్టి, కళ్లాల్లో ధాన్యం కొనకుండా కన్నీళ్లు పెట్టించి..రైతులను పండుగ చేసుకోవాలనడం సిగ్గుచేటు' అని ఫైర్ అయ్యారు. ఓట్లు దండుకొని కాంగ్రెస్ చేసిన మోసాలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



కెరమెరి మండలం బాబేఝరిలో మిషన్ భగీరథ నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

# 'మిషన్ భగీరథ' నీళ్లిచ్చిండ్రు

**స్పందించిన కెరమెరి ఎంపీడీవో.. పలు గ్రామాలకు నీటిసరఫరా**

నమస్తే ఎఫెక్ట్

కెరమెరి, జూన్ 24 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం తాగు నీటిని సరఫరా చేశారు. తాగు నీరందక గిరిజనులు సోమవారం కెరమెరి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ విషయమై 'సారూ.. మీ కాళ్లు మొక్కుతం.. తాగడానికి నీళ్లియ్యండి' అనే శీర్షికన మంగళవారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషా మంగళవారం జోడేఘాట్, పాట్నాపూర్, బాబేఝరి, శివాగూడ, పాటగూడ, పిట్టగూడ, కొలాంగూడ, మహారాజ్‌గూడ తదితర గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేశారు. పలు గ్రామాల్లో ట్యాంకర్ ద్వారా తాగు నీటిని అందించారు.

# పాతవి పట్టవు.. కొత్తవి కట్టరు!

## భవనాల నిర్మాణంపై చేతులెత్తేసిన ప్రభుత్వం

### గతంలో చేపట్టిన భవనాల పూర్తికే ఆపసోపాలు

- బీఆర్ఎస్ హయాంలో 2 కోట్ల చదరపు అడుగుల నిర్మాణాలు
- సచివాలయం, కలెక్టరేట్లు సహా అనేక భవనాలు నిర్మాణం
- తెలంగాణ ఏర్పడేనాటికి ఉన్నవి 50 లక్షల చదరపు అడుగులే
- పాతవి పూర్తి చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఆపసోపాలు



హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాల విస్తీర్ణం దాదాపు 50 లక్షల చదరపు అడుగులు.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2 కోట్ల చదరపు అడుగులకుపైగా నిర్మాణాలు జరిగాయి. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పడిన తపనకు ఇది నిదర్శనం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో ఒక్క కొత్త భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయలేదు. కనీసం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై తుది దశకు చేరిన పనులను కూడా పూర్తి చేయడం లేదు. ప్రభుత్వ భవనాల నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందనడానికి ఇదే నిదర్శనం. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కనీసం దవాఖానలనైనా పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారా అంటే అదీ లేదు. మొత్తంగా పాతవి పూర్తి చేయరు.. కొత్తవి కట్టరు అన్న చందంగా తయారైంది పరిస్థితి.

### బీఆర్ఎస్ పాలనలో పరుగులు

తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న భవనాల వైశాల్యం 30 లక్షల చదరపు అడుగులు మాత్రమే. నిజాంల కాలంలో నిర్మించినవాటితోసహా దవాఖానల వైశాల్యం మరో 20లక్షల చదరపు అడుగులు అని అధికారులు చెప్తున్నారు. అంటే రాష్ట్రం ఏర్పడేనాటికి ఉన్న ప్రభుత్వ భవనాల వైశాల్యం కేవలం 50 లక్షల చదరపు అడుగులు. తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలపడమే కాకుండా ప్రజలకు మెరుగైన వసతులు అందించాలనే కేసీఆర్ ప్రభుత్వం అనేక నిర్మాణాలు చేపట్టింది. సచివాలయం, మెడికల్ కాలేజీలు, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్లు, సూపర్ స్పెషాలిటీ దవాఖానలు ఇలా అనేక ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించింది. నిర్మాణాల్లో సింహభాగం భవనాలను గడువులోగా పూర్తిచేసింది. పదేండ్లలో సుమారు 2 కోట్ల చదరపు అడుగులకుపైగా అదనపు భవనాలను జోడించింది. దాదాపు 1.4కోట్ల చదరపు అడుగుల నిర్మాణాలు కేసీఆర్ హయాంలోనే అందుబాటులోకి వచ్చాయి. 5 సమీకృత కలెక్టరేట్ భవనాలు, 3 టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఎంజీఎం, పలు ఎమ్మెల్యే కార్యాలయ భవనాలు అన్నీ కలిపి మరో 60లక్షల చదరపు అడుగుల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి.

### పూర్తిచేయని రేవంత్ సర్కారు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెప్పుకోదగ్గ నిర్మాణాలేవీ చేపట్టలేదు. అంతేకాదు, తుది దశలో ఉన్న భవన నిర్మాణాలను కూడా పూర్తిగా పక్కకు పెట్టింది. కనీసం ప్రజలకు అవసరమైన ఆసుపత్రుల నిర్మాణంపై కూడా నిర్లక్ష్యం వహిస్తున్నది. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న మూడు టిమ్స్ ఆసుపత్రులతోపాటు వరంగల్ ఎంజీఎం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఇప్పటికే అందుబాటులోకి రావాల్సి ఉన్నది. అయితే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగు పెట్టడంతో పనులు సాగడం లేదు. ఫలితంగా తుదిదశకు చేరుకున్న భవనాలు అలాగే అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఆదివారం ఆర్అండ్‌బీ శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా సమీకృత కలెక్టరేట్ల పెండింగ్ బిల్లుల అంశాన్ని అధికారులు ప్రస్తావించినా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నుంచి స్పష్టమైన హామీ రాలేదట. సీఎంతో చర్చించి బిల్లులు చెల్లించేలా చూస్తానని చెప్పడంతో అవి ఎప్పటికి మంజూరవుతాయో అర్థంకావడం లేదని అధికారులు అంటున్నారు.

### పాలనా సౌలభ్యం.. అందుబాటులో ఆరోగ్యం

కేసీఆర్ హయాంలో నిర్మించిన భవనాలు పాలనాపరంగా ప్రజలకు సౌలభ్యంతోపాటు ఆవశ్యకమైన ఆరోగ్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు స్పష్టం అవుతున్నది. సచివాలయం, సమీకృత కలెక్టరేట్లు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు వంటివి చేపట్టారు.

- గాంధీ, ఉస్మానియా, నిమ్స్ దవాఖానలు ప్రస్తుత అవసరాలను తీర్చలేకపోతున్నాయన్న కారణంతో హైదరాబాద్ చుట్టూ మూడువైపులా రూ.2679 కోట్ల వ్యయంతో ఎల్బీనగర్, సనత్‌నగర్, అల్వాల్‌లో టిమ్స్(తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సూపర్ స్పెషాలిటీ దవాఖానల నిర్మాణాలు చేపట్టింది. రూ.1200కోట్లతో వరంగల్‌లో ఎంజీఎం మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం ప్రారంభించింది. నాలుగు కలిపి సుమారు 50లక్షల చదరపు అడుగులమేర నిర్మాణాలు చేపట్టింది.
- రూ.139కోట్లతో 100నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల నిర్మాణం.
- రూ.1650 కోట్లతో 30 జిల్లాల్లో జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాలు. 25 ఇదివరకే పూర్తికాగా, 5 వివిధ దశల్లో ఉన్నాయి.
- సకల హంగులతో రాష్ట్ర రాజధానిలో రూ.617 కోట్లతో సచివాలయ భవనం.
- హైదరాబాద్‌లో రూ.585కోట్లతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనం.

# ధర్నా చేసిన బీఆర్ఎస్ నాయకులపై కేసు

మంచిర్యాల, జూన్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్వీ నాయకుడు దగ్గుల మధుపై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం బెల్లంపల్లి చౌరస్తాలో ధర్నా చేసిన నాయకులపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఎలాంటి అనుమతులులేకుండా చేసిన ధర్నాతో పలువురు ఇబ్బందులు పడ్డారని హెడ్‌కానిస్టేబుల్ అన్వర్‌హుస్సేన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో పాటు రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు సహా 30 మందిపై 189(2), 126(2), 132,ఆర్/డబ్ల్యూ 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. అదే రోజు కాంగ్రెస్ నాయకులు సైతం బెల్లంపల్లి చౌరస్తాలో ధర్నా చేశారని, వారిపై ఏం కేసులు పెట్టారో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ ధర్నా చేస్తే వచ్చిన ఇబ్బందులు కాంగ్రెస్ నాయకులు చేసినప్పుడు రాలేదా అంటూ ప్రశ్నించారు. న్యాయం కోసం ధర్నా చేస్తే కేసులు నమోదు చేయడం సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు పేర్కొన్నారు.

## లోకం పోకడ




## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 36.9°c | 24.4°c |
| నల్లగొండ | 35.0°c | 23.0°c |
| రంగారెడ్డి | 34.7°c | 22.0°c |
| మెదక్ | 34.0°c | 25.2°c |
| నిజామాబాద్ | 33.8°c | 25.6°c |
| ఖమ్మం | 33.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 33.0°c | 23.0°c |
| హైదరాబాద్ | 32.4°c | 24.0°c |
| కరీంనగర్ | 32.0°c | 26.0°c |
| వరంగల్ | 32.0°c | 24.0°c |

# నెలాఖరుపైనే అన్నదాత ఆశలు

- దేశవ్యాప్తంగా భారీ వర్షాలకు చాన్స్
- నాలుగు రోజులపాటు మోస్తరు వానలు
- తాజాగా వాతావరణ శాఖ వెల్లడి



హైదరాబాద్, జూన్ 24 (నమస్తేతెలంగాణ): ఈ నెల ఆఖరివారంపై అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటివరకూ సరైన వానలు లేక ఆందోళనలో ఉన్న రైతులకు అందిన ఓ శుభవార్త వారిలో ఆశలను రేకెత్తిస్తున్నది. జూన్ నెల చివరి వారం దేశవ్యాప్తంగా భారీ వర్షాలు ఉంటాయని మంగళవారం కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వచ్చే వారం రోజులైనా ఆశాజనకంగా వర్షాలు కురుస్తాయని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై 24 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పెద్దగా వర్షాలు పడలేదు. దీంతో పంటలు వేసేందుకు రైతులు ఆలోచిస్తున్నారు. 10 రోజులు ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని.. ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షాలు పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పంటల సాగు ముందే మొదలవుతుందని అన్నదాతలు ఆశపడ్డారు. కానీ సీజన్ ప్రారంభమైన తర్వాత నిరాశే మిగిలింది. రుతుపవనాలు బలహీనపడటంతో వాటి కదలిక స్తభించిపోయింది. దీంతో 15 రోజుల పాటు నైరుతి రుతుపవనాల కదలిక నిలిచిపోయింది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా తొలకరి వానలకు విత్తనాలు చల్లిన రైతులు.. ఇప్పుడు వానలు ముఖం చాటేయడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న ఇలాంటి వాతావరణ పరిస్థితులు ఈ సీజన్‌లో కుంభవృష్టి లేదా కరువు తప్పదేమోననే ఆందోళన చెందుతున్నారు.

### తేలికపాటి నుంచి మోస్తరు వానలు

వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా తీరలో సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ నుంచి 7.6 కి.మీ మధ్య ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పశ్చిమ, నైరుతి దిక్కుల నుంచి కిందిస్థాయిలో గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే 4 రోజులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీచేసింది. మంగళవారం రాష్ట్రంలోని కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసిందని వాతావరణ శాఖ వెల్లడించింది. కుమ్రంభీం జిల్లా బెజ్జూర్ మండలంలో 6.13 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైనట్టు తెలిపింది. బుధవారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో గంటకు 30-40 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# తెలంగాణలో అనుమతుల్లేని ప్రాజెక్టులు

- అయినా మేం అభ్యంతరం చెప్పలేదు
- రాజకీయ లబ్ధి కోసమే గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు
- తెలంగాణ రాష్ట్రంపై మరోమారు విషంచిమ్మిన సీఎం చంద్రబాబు
- త్వరలోనే బనకచర్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన: మంత్రి లోకేశ్



హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): బనకచర్లపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం మరోసారి స్పందించారు. ఈ ప్రాజెక్టు విషయమై సోమవారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడినట్టుగానే, మంగళవారం జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు మాట్లాడినట్టు తెలిసింది. అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ ఇద్దరూ పరోక్షంగా, ప్రత్యక్షంగా బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేస్తూనే మాట్లాడడం గమనార్హం. బనకచర్ల ప్రాజెక్టుకు వీరిద్దరూ కలిసే అంకురార్పణ చేశారన్న బీఆర్ఎస్ వాదనకు వీరి వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయి. క్యాబినెట్ సమావేశం అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణలో అనుమతుల్లేని చాలా ప్రాజెక్టులు కడుతున్నారని అడ్డగోలుగా ఆరోపించారు. తాము అభ్యంతరం చెప్పలేదని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే తెలంగాణలో కొందరు బనకచర్లపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారని విమర్శించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని మరోసారి పాత పాటే పాడారు. తెలంగాణకు ఉన్న అన్ని అనుమానాలు నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయంలో కేంద్రం జోక్యం అవసరమని పేర్కొన్నారు. ప్రాజెక్టు విషయం ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు కేంద్రం ద్వారా ఓ సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పారు. సున్నితమైన అంశం కావడంతో నేతలు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. ఇక ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా బనకచర్లపై స్పందించారు. ప్రాజెక్టుకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరామని, త్వరలోనే ప్రాజెక్టు పనులు మొదలవుతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

# బనకచర్లపై బాబుతో చర్చలేంది?

మొదటిపేజీ తరువాయి...

భాస్కర్‌రావు, మెతుకు ఆనంద్, రవీందర్‌నాయక్, బీఆర్ఎస్ నేతలు ఒంటెద్దు నర్సింహారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గోదావరి జలాల వినియోగం, బనకచర్లపై కాంగ్రెస్ సర్కారు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అందుకే మొన్నటి క్యాబినెట్ భేటీలో తూతూ మంత్రంగా చర్చించి చంద్రబాబును చర్చలకు పిలవాలని నిర్ణయించడం దిక్కుమాలిన చర్య అని మండిపడ్డారు. ఆంధ్రా ప్రయోజనాల కోసం కొమ్ముకాసే ఓ వర్గం మీడియా బనకచర్ల అంశాన్ని తెలంగాణలోని పార్టీల మధ్య పంచాయితీగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలోని అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉన్నదని నొక్కిచెప్పారు. గోదావరి జలాలు తెలంగాణ ప్రజల బతుకుదెరువని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పార్టీలతో కలిసి కార్యాచరణ సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎన్నిసార్లు తట్టిలేపినా అధికార పార్టీకి సోయికి రాకపోవడం శోచనీయమని ఫైర్ అయ్యారు.

### గోదావరి-కావేరి లింక్ ముగిసిన అధ్యాయం

మోదీ సహకారంతో ఏపీ సీఎం నదుల అనుసంధానం పేరిట గోదావరి-కావేరి లింక్‌ను తెరపైకి తేవడం దుర్మార్గమని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారం ముగిసిన అధ్యాయమని అభివర్ణించారు. 'గతంలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా వ్యతిరేకించింది.. మా రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా 150 టీఎంసీల ప్రాజెక్టులు కట్టుకుంటున్నం.. ఒక్క చుక్క కిందికి వదలబోమని తేల్చిచెప్పింది' అని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు చంద్రబాబు మాత్రం ఈ ముసుగులో తెలంగాణను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. బాబు మాయలో పడి రేవంత్ సర్కారు రాష్ట్రానికి తీరని నష్టం చేయవద్దని హితవు పలికారు. బనకచర్ల, కావేరి లింక్‌ను అడ్డుకొనేందుకు బీఆర్ఎస్ ఇతర పార్టీలతో కలిసివచ్చేందుకు సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు.

### బీజేపీ మంత్రులు అవగాహన పెంచుకోవాలి

బనకచర్ల, గోదావరి జలాల విషయంలో బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఎంపీలు అవగాహన పెంచుకోవాలని జగదీశ్‌రెడ్డి సూచించారు. గతంలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వం, అక్కడి నాయకులు గోదావరి-కావేరి లింక్‌పై కేంద్రం వైఖరిని తప్పుపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు ఇదే తరహాలో మన రాష్ట్రానికి చెందిన బీజేపీ నాయకులు బనకచర్ల, కావేరి అంశాలపై కేంద్రాన్ని నిలదీయాలని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు.

### నీటిని కొల్లగొట్టేందుకు బాబు ఎత్తుగడ

గతంలో బీఆర్ఎస్ చేసిన కృషితో త్వరలోనే గోదావరి ట్రిబ్యునల్ ఏర్పాటయ్యే అవకాశం ఉన్నదని జగదీశ్‌రెడ్డి తెలిపారు. కాగా ముందే అప్రమత్తమైన చంద్రబాబు ట్రిబ్యునల్ రాకముందే గోదావరిలో 200 టీఎంసీల హక్కును పొందేందుకు ఎత్తుగడ వేస్తున్నారని విమర్శించారు. గోదావరిలో మిగులు జలాలను వాడుకుంటే తప్పేంటని సన్నా యి నొక్కులు నొక్కుతున్నారని ఫైర్ అయ్యారు.

### కేసీఆర్ లేఖపై రాద్ధాంతం

బనకచర్ల అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవడంలో విఫలమవుతున్న రేవంత్ ప్రభుత్వం గోదావరి మిగులు జలాల తరలింపు విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నదని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. నాడు కేసీఆర్ గోదావరిపై మూడు లిఫ్టులు ఏర్పాటు చేసి నాగర్జునసాగర్ టెయిల్ పాండ్, అక్కడి నుంచి శ్రీశైలానికి తరలించాలని ఏపీ సర్కారుకు ప్రతిపాదించారని గుర్తుచేశారు. కేవలం రూ.10 వేల కోట్లు ఖర్చు పెడితే చాలని సూచించారని చెప్పారు. నల్లగొండ, మహబూబ్‌నగర్‌లోని కరువు ప్రాంతాలతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చుకోవచ్చని భావించి ఈ ప్రతిపాదనలను చేశారని స్పష్టంచేశారు. కానీ చంద్రబాబు మాత్రం తక్కువ ఖర్చుతో ఆంధ్రాకు గోదావరి జలాలను తరలించే అంశాన్ని పక్కనబెట్టి రూ.80 వేల కోట్లతో బనకచర్లను నిర్మించేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని మండిపడ్డారు. దీని వెనుక తెలంగాణను శాశ్వతంగా ఎండబెట్టి గోదావరి జలాలను దోపిడీ చేసేందుకు కుతంత్రాలు దాగి ఉన్నాయని విరుచుకుపడ్డారు. చంద్రబాబుకు మడుగులొత్తుతున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అజ్ఞానంతో కేసీఆర్‌పై నిందలేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ సర్కారుకు ఊపిరిగా మారారని, అందుకే ఆయన చెప్పినట్టు గోదావరి జలాల తరలింపునకు మోదీ గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారని విమర్శించారు. మన రాష్ట్ర బీజేపీ ఎంపీలు కూడా నోరుమూసుకొని ఆంధ్రాబాబుకు దాసోహమవుతున్నారని ధ్వజమెత్తారు.

### ప్రజలతో కలిసి ఉద్యమానికి సిద్ధం

బనకచర్ల విషయంలో కాంగ్రెస్ కార్యాచరణ ప్రకటించాలని, అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంతో పోరాటం చేయాలని జగదీశ్‌రెడ్డి సూచించారు. ఒక వేళ కాంగ్రెస్ సర్కారు పెడచెవిన పెడితే బీఆర్ఎస్ పార్టీయే కార్యాచరణ చేపడుతుందని ప్రకటించారు. ప్రజలతో కలిసి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.



తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

> *గతంలో కేసీఆర్ చేసిన కృషి వల్ల త్వరలోనే గోదావరి ట్రిబ్యునల్ ఏర్పాటయ్యే అవకాశం ఉన్నది. కానీ ముందే అప్రమత్తమైన చంద్రబాబు ట్రిబ్యునల్ రాకముందే గోదావరిలో 200 టీఎంసీల హక్కు పొందేందుకు ఎత్తుగడ వేస్తున్నడు. గోదావరిలో మిగులు జలాలను వాడుకుంటే తప్పేమిటని సన్నాయి నొక్కులు నొక్కుతున్నడు.* -జగదీశ్‌రెడ్డి

> *ఇప్పటికే కృష్ణా జలాల విషయంలో జరిగిన అన్యాయంతో తెలంగాణ రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. ఇప్పుడు చంద్రబాబు ఎత్తుగడలతో గోదావరి జలాల వినియోగంలోనూ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నది. కాంగ్రెస్ సర్కారు కండ్లు తెరిచి బనకచర్లను అడ్డుకోవాలి. రేవంత్‌రెడ్డి తన రాజకీయ స్వార్థం కోసం చంద్రబాబుకు దాసోహం కావద్దు. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెట్టొద్దు* -జగదీశ్‌రెడ్డి

### మోసం చేసి సంబురాలా?

రైతు భరోసాను కుదించి, రెండుసార్లు ఎగ్గొట్టి, రుణమాఫీ పేరిట దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు సంబురాలు ఎందుకు నిర్వహిస్తున్నదో అర్థం కావడంలేదని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నారని ఉత్సవాలు జరుపుకొంటున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో తెలంగాణలోని పల్లెల్లో 2014కు ముందు పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. కరెంట్‌లేక, నీరందక, ధాన్యం కొనుగోలు చేసే నాథుడులేక రైతులు అరిగోస పడుతుంటే కాంగ్రెస్ మాత్రం ఓట్ల కోసం రైతుభరోసా పేరిట నాటకానికి తెరలేపిందని ధ్వజమెత్తారు. 'లక్ష కోట్లు లబ్ధి చేకూర్చామని ప్రభుత్వం ప్రగల్బాలు పలుకుతున్నది.. రైతులంటే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డా? భట్టి విక్రమార్కనా? ఉత్తమ్‌కుమార్‌రెడ్డా? చివరికి రేవంత్‌రెడ్డా?' అని ఎద్దేవా చేశారు. 20 లక్షల ఇండ్లు నిర్మించాకే ఎన్నికలకు వెళ్తామని మంత్రి పొంగులేటి చెప్పడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. ఏడాదిన్నరలో ఒక్క ఇల్లు కట్టని ప్రభుత్వం మూడేండ్లలో 20 లక్షల ఇండ్లు నిర్మిస్తామంటే ఎవరు నమ్ముతారు?' అని దెప్పిపొడిచారు.

# ప్రధాని నేతృత్వంలో పోలవరంపై నేడు సమీక్ష

- ముంపు అంశాలపై రాష్ట్రాలతో చర్చ



హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం నిర్వహించే ప్రగతి సమావేశంలో పోలవరం ప్రాజెక్టుపై చర్చించనున్నారు. ప్రాజెక్ట్ పనుల పురోగతి, ముంపు తదితర అంశాలపై సమీక్షించనున్నారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 41.67 మీటర్ల ఎత్తులోనే నీటిని స్టోర్ చేసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. ఆ ఎత్తులో తెలంగాణ ప్రాంతంలోనూ 6 మండలాల్లోని 954 ఎకరాలు ముంపునకు గురి కానున్నాయి. భద్రాచలం టౌన్, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్లకూ ముంపు ముప్పు పొంచి ఉంది. దీంతోపాటు కిన్నెరసాని, ముర్రేడువాగు, మరో ఆరేడు స్థానిక వాగుల్లో డ్రైనేజీ తీవ్రత ఎక్కువ అవుతుందన్న ఆందోళన ఉన్నది. దుమ్ముగూడెం ప్రాజెక్టు కింద 36 వాగులు వచ్చి చేరుతుండటంతో పోలవరం బ్యాక్ వాటర్ వల్ల వాటి డ్రైనేజీ వ్యవస్థలు తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. సర్వే చేయించి డీమార్కేషన్ చేయించాలని తెలంగాణ పట్టుబడుతున్నది. జాయింట్ సర్వేకు ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలు కూడా పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆయా అంశాలపై ప్రధాని మోదీ ప్రగతి సమావేశంలో చర్చించనున్నారు.

# స్థానిక ఎన్నికలపై నేడు తీర్పు

మొదటిపేజీ తరువాయి...

వాయిదా కోరింది. గత విచారణలో కూడా ఇదే తరహాలో వాయిదా కోరిన ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ వాయిదా కోరడం ఏమిటని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. బీసీ రిజర్వేషన్ల అంశం తేల్చేందుకు డెడికేటెడ్ బీసీ కమిషన్ ఏర్పాటుచేశామని, బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడమే తమ ముందున్న అంశమని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ప్రభుత్వం నుంచి అనుమతి లభించాక ఎన్నికల నిర్వహణకు తమకు రెండు మాసాల వ్యవధి కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది. ఈ వాదనలు సోమవారం ముగియడంతో బుధవారం హైకోర్టు తీర్పు వెలువరించనున్నది.